


వాన రాబోతోంది.

ఆకాశంలో నల్లని మబ్బులు మత్తగజాల్లా నడుస్తూ, ఒకదానితో మరొకటి ఢీకొని ఘీంకారాలు చేస్తున్నాయి. కాపటానికి మిట్టమధ్యాహ్నమే అయినా, దట్టంగా మబ్బులు కమ్మినందు వల్ల, దానికితోడు చల్లనిగాలి రివ్వుమని వీస్తున్నందువల్ల వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది.

నున్నగానున్న సిమెంటు రోడ్డుమీద కారు, ఎక్కుపెట్టి విడిచిన బాణంలా దూసుకుపోతోంది. హోరెత్తిపోయే ఆ నగర వాతావరణంనుంచి, కలుషిత మైపోయిన ఆ జీవితంనుంచి, ఇలా ప్రశాంతంగా, నిద్రాణమైన ఈ అడవి ప్రాంతంలోకి అప్పుడప్పుడు వాహ్యాళికి వచ్చిపోవటం చంద్రమౌళిగారికి ఇష్టం.

వెనకసీట్లో చేరగిలబడి, వెనక్కి దూసుకుపోతున్న చెట్టూ చేమల్ని చూస్తూ గుండెలనిండుగా గాలి పీల్చుకుంటే, స్వచ్ఛమైన ప్రాణవాయువు ఒంటికి ఎంతో ఉత్తేజాన్ని కలిగించినట్లు అనిపించింది. నగరపు నడివీధిలో కారు ముందుకు సాగటమే కష్టం. బస్సులూ, లారీలు, కార్లు, స్కూటర్లు, సైకిళ్ళు— అన్నీ అడుగడుగునా అడ్డంపడుతూనే ఉంటాయి. తన జీవనయానానికి అడుగడుగునా నిరాశా నిస్పృహలు ఎదురై, కృంగదీసినట్లు-దీర్ఘంగా నిశ్వాస వదిలాడు.

కారు రంయ్‌మని దూసుకుపోతోంది. డ్రైవరు వెంకటేశం మంచి అనుభవం ఉన్నవాడు. అంత రద్దీగా ఉండే సిటీలోనే దూసుకుపోతుంటాడు. ఇలాంటి నిర్జన ప్రదేశాలకొస్తే, వాడి చేతిలో కారు రోడ్డుమీద పరుగెత్తుతోందా, గాలిలో తేలుతోందా అన్న సందేహం రావల్సిందే. సైడువిండోలోనుంచి రెండు చినుకులు టపటపమని చంద్రమౌళిగారి చేతిమీద రాలినయి. మామూలు నీటిబొట్లులాగాక, అవేవో అమృతపుబొట్లు వాలికినట్లుగా ఉంది. ఒకే ఒక్కసారి ఇలాగే తన చేతిమీద రెండు కన్నీటిబొట్లు రాలినయి. అవి ఎవరివో కాదు, తనవే. సావిత్రి వెళ్ళిపోయిందని తెల్సినప్పుడు, ఎందుకో కడుపులో భగ్గున మంట రగిలింది. ఆ మంటకు గుండెల్లో నిండుగానున్న ప్రేమాభిమానాలు మరిగి ఆవిరై ఆవేశంగా మారి గొంతుపైకి ఎగదన్ని, కన్నుల్లో కరిగి నీరై, కన్నీరై రాలినయి. అవీ రెండు బొట్లే, అంతే. జీవితంలో మళ్ళీ ఎప్పుడూ, ఎవర్నీ మనస్ఫూర్తిగా నమ్మలేదు. అసలు నమ్మకం అనే మాటను ఆయన మర్చిపోయ్యాడు. ఎవర్ని మాత్రం ఎలా నమ్మటం?

గుడ్డి గవ్వలాంటి సావిత్రిని తీసుకొచ్చి, ఈ నా హృదయ సామ్రాజ్యానికే గాక, ఎకరం విస్తీర్ణంగల ఈ అందమైన ఆవరణలో అధునాతనంగానున్న భవంతికేగాక, ఆ భవనం పైభాగంలోనున్న సువిశాలమైన పడకగదిలో రెండు నిలువెత్తు ఇనుప రక్షణల్లో వున్న డబ్బుకూ, నగలకూ మాత్రమేగాక, నగరం నడిబొడ్డుమీదనున్న బ్యాంకులోని డిపాజిట్లకేగాక, నగర పొలిమేరలోనున్న ద్రాక్షతోటలకూ నీవే పట్టమహిషివి—అని చెప్పినప్పుడు ఎంత




అందంగా నవ్వింది! తన చీకటి బ్రతుకు వాకిట్లోకి ఒక్క తోకచుక్క రాలినట్లు, సావిత్రి చిరునవ్వు తన జీవితంలో ఎంత వెలుగు నింపింది!

తింటూ, నిద్రపోతూ, లేస్తూ, ఆవలిస్తూ, ఆకాశంకేసిచూస్తూ, నిట్టూరుస్తూ ఈదవలేక ఈదుస్తున్నట్లు రోజులను ఈడ్చుకెళ్తున్నరోజుల్లో సావిత్రి ఎదురై తనచుట్టూ గిరగిరా తిప్పుకుని, చుట్టూ ఎటు చూసినా తనే కనిపించి కిలకిలలు కురిపించి, రారమ్మని చెయ్యిపట్టుకుని శరవేగంతో లాక్కువెళ్ళి, ఇసుక తిన్నెలమీద మిసిమి వెన్నెలవేళ పడుతూ లేస్తూ, పరుగిడుతూ, పడిలేచే కెరటాలకు ఎదురెడుతూ, అవి ముంచెత్తితే గొంతెత్తి అరుస్తూ తనను పెనవేసుకుంటే—అప్పుడు భూభ్రమణం ఆగిపోయింది. గాలి స్థంభించింది. కాలం 'కీ' ఇచ్చేవాడు లేనట్లు నిశ్చలంగా నిలిచిపోయింది.

ఇప్పటికీ జ్ఞాపకాల ఆల్బంలో ఎన్ని స్టిల్ ఫోటోలు! కన్యాకుమారివద్ద భారతదేశపు చిట్టచివరి బండరాతిమీద కూర్చుని సముద్రపు అంచున ఎర్రగా కొలిమిలో కాలిన ఇనుపరేకులాంటి సూర్యుడు అస్తమించే సుందర దృశ్యాన్ని సావిత్రి అందమైన కనుపాపల్లో చూడటం, గుల్మార్గ్ మంచు కొండలమీదనుంచి సావిత్రి చెయ్యి పట్టుకుని జారిపోవటం, గంగానదిలో పడవ ప్రయాణంచేస్తూ విసిరేగాలికి ఎగిసిపడే సావిత్రి పైటకొంగులో తలదూర్చి ముసిరే చీకట్లలో సజీవ సౌందర్యాన్ని సరికొత్తగా చూడటం, పిండారబోసినట్లున్న వెన్నెల్లో సావిత్రి ఒడిలో పడుకుని ముంతాజ్ మందిరాన్ని చూస్తూ అంతకుమించిన చలవరాతి మందిరాన్ని ఆమెకోసం (హృదయంలో) కట్టిస్తానని వాగ్దానం చేయటం, డైమెండ్ నెక్లెస్‌లా మెరిసిపోతున్న మెరీన్ డ్రైవ్‌లో పబ్లిక్‌గా ముద్దుపెట్టుకోవటం—అన్నీ ఆయనకు గుర్తే. మర్చిపోతేగదా!

కాలం గాయాల్ని మాన్పుతుందంటారు. కానీ అది నిజంకాదు సుమా. ఆలోచనల దుమ్మునూ ధూళినీ ఆ గాయాలమీదకే జేర్చి పెద్దపెద్ద వ్రణాలుగా మారుస్తుంది. అవి ఏ శస్త్ర చికిత్సకూ లొంగని మానసిక వ్యాధికి మూలకారణాలవుతాయి. అంతే . . . వెన్నంటివచ్చే ఈ ఆలోచనా పరంపరలు తనువుతో నశింపవలసిందే! అందునా సావిత్రి తనదగ్గర జారవిడిచిపోయిన అరుదైన అనుభవాలు, విలువైన వజ్రాలకన్నా ఖరీదైనవి. మరవటం మనిషి తరమా? పోనీ, దేవుడి తరమా?

చినుకులు పెద్దవి అయినయి. వెంకటేశం గుర్తుచేసేదాకా చంద్రమౌళి గారికి తెలియనేలేదు. సగం తడిసిపోయినాడు. అయినా ఫర్వాలేదు. సావిత్రి ఎలాగూ లేదు. అహ, రాదు. పోనీ ఆమెతో గడిపిన గతకాలపు స్మృతుల లోనన్నా తడిస్తే చాలదా? ఈ ఊహలే రెక్కలు కట్టుకుని వచ్చి తనముందు వాలి, రివ్వున ఎగిరి ఊళ్ళని మేడల్ని, రేవులోని ఓడల్ని, నీలినీటి సముద్రాలను దాటించి ఎక్కడెక్కడికో తీసుకువెళ్తాయి! చిత్రంగా అక్కడా సావిత్రే కనిపిస్తుంది. తనే మళ్ళీ వెంటనే వచ్చేస్తాడు శోకంలేని ఈ లోకంలోకి. నిజానికి తనకేం తక్కువ? ఈ ప్రశ్న కొన్ని వందలవేల లక్షలకోట్ల సార్లు వేసుకున్నాడు, ఒక్కసారైనా జవాబు దొరుకుతుందేమోనని. అప్పుడంతగా ప్రేమించిన మనిషి, తన ఆశల అందమైన దుస్తులనిండా ఘుమఘుమలాడే అత్తరులు అద్దిన సావిత్రి ఎందుకు వెళ్ళిపోయింది? సావిత్రి ఫోటోకు మెరిసే బంగారు పూతగల ఫ్రేం కట్టించి, గుండెగదిలో మేకుకొట్టి అందంగా వేలాడేసుకుంటే, గుండెల మీద తలవాల్చి పడుకున్నట్లే పడుకుని, ఒక్క ఉదుటున లేచి ఫోటో అద్దాన్ని బద్దలుకొట్టి, గుండెల్లో విచ్చుకత్తిని గుచ్చి వెళ్ళిపోయింది. ప్రాణంపోయిందీ కాదు, సుఖంగా ఉన్నదీలేదు. అప్పుడే కన్నుల గాజుగిన్నెల్లో నుంచి రెండు అశ్రుకణాలు తొణికినయి. సగంధైర్యం సగం సహనంగల గళ్ళజేబురుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు.

కీచుమని శబ్దంచేస్తూ కారు ఆగిపోయింది. ఒక్కసారి బలంగా ఒళ్ళంతా కుదిపినట్లు అయింది.

"ఏమైంది, వెంకటేశం?"

"కుక్కపిల్ల సార్, రోడ్డుకు అడ్డంగా నిలబడింది..." హారన్ కొట్టాడు.

కుక్క పక్కకు తప్పుకోలేదు. అరుస్తోంది. కాదు, ఏడుస్తోంది. వెంకటేశం కారు పక్కకు మళ్ళించి, ముందుకు పోనిచ్చాడు.

చంద్రమౌళిగారు తల వెనక్కి తిప్పి చూశాడు. వానలో తడుస్తూ కారు వెంట పరుగెత్తుతూ కొద్దిదూరం వచ్చింది కుక్క, దీనంగా ఏడుస్తూ. అసలీకుక్క నిర్మానుష్యమైన చోటికి ఎలావచ్చింది, తనవాళ్ళందర్నీ వదిలి? .. అవును అయినవాళ్ళను కాదని వెళ్ళిపొయ్యాక ఎవరికైనా అంతే...కుక్క బతుకే...తర్వాత తర్వాత తన చెవి దాకా వచ్చింది. సావిత్రిది కుక్క బతుకై పోయిందని, ఇలాగే రోడ్డున పడిందని...ఎన్నోసార్లు అనిపించింది, వెళ్ళి సావిత్రిని తీసుకువద్దామా అని... కానీ, ఛీ...అలాంటి నమ్మకద్రోహి మొహంచూడటం మహాపాపం ... ఏం చేస్తోందో? ఈ కుక్కలాగే రోడ్డునపడి...

"వెంకటేశం..."

"అయ్యా..."

"కారు వెనక్కి తిప్పు..."

"ఎక్కడికండి ?..."

"ఆ కుక్కను తీసుకువద్దాం..."

చిత్రమైన ఆయన కోరికకు క్షణకాలం ఆశ్చర్యపోయినా, వెంకటేశం వెంటనే ఆయన ఆజ్ఞను అమలుపరచాడు. కుక్కను కారులోకి ఎక్కించుకుని బయల్దేరారు. తడిసి అసహ్యంగా ఉన్నాసరే, ఎందుకో ఒక్కసారి ప్రేమగా ఆ కుక్క ఒంటిని నిమరాలన్న కోరికను ఆయన ఆపుకోలేకపోయినాడు. అంత ఆప్యాయంగా తడుముతుంటే కుక్క వంగి ఆయన పాదాలను నాకింది. అలా ఏర్పడ్డది కుక్కతో చంద్రమౌళిగారి అనుబంధం.


ఇంట్లో దానికి ప్రత్యేకమైన స్థానం



లభించింది. అసలు అది ఎప్పుడూ ఆయనను వెన్నంటి తిరుగుతూనే ఉంటుంది — ఒకనాటి సావిత్రిలా, ఎక్కడికైనా వెళ్ళి కాస్త ఆలస్యంగా వస్తే, కారు దిగుతుండగానే మీదపడి భౌమంటుంది. ఆ రోజుల్లో సావిత్రి ఇలాగే మీదపడి పోట్లాడేది. కాలం మళ్ళీ వేగాన్ని పుంజుకుంది. రోజులు గడిచిపోయి, కాలెండరులోని కాగితాలు తిరిగిపోయినాయి.

కుక్కపిల్లకు టామీ అని పేరు పెట్టారు చంద్రమౌళిగారు. ఆ ఇంట్లో టామీ తిరగని చోటులేదు. ఇంట్లోనే అనేమిటి, ఆయన ఎక్కడికి బయల్దేరినా టామీ ఆయనకన్నా ముందే వెళ్ళి కార్లో కూర్చుంటుంది. ఆయనతోపాటే, అదీ భోజనంచేస్తుంది. ఆయన గదిలోనే ఆయన మంచందగ్గరే పడుకుంటుంది. ఆయన భావాన్ని ఇట్టే పసిగడుతుంది. భాషను బాగా అర్థంచేసుకుంటుంది. గుమ్మంలోకి దొరలొస్తే ఆయన్ని పిలుస్తుంది. దొంగలొస్తే వాళ్ళను కరుస్తుంది. రోజూ వచ్చేవాళ్ళెవరో, ఎవరెలాంటివారో టామీకి స్పష్టంగా తెల్సు దానికి మాటలు రావన్నట్టేగాని, ఎదిగిన పిల్లలా ఇంట్లో తిరుగుతూ, అన్నీ కనిపెడుతూనే ఉంటుంది.

సోఫామీదకు ఎక్కి ఆయన పక్కన కూర్చుని ఆయనతోపాటు పేపర్లోకి చూస్తుండే టామీని చూసి, ఆయన కాళ్ళదగ్గర కూర్చుని బూట్లు పాలిష్‌చేసే వెంకటేశం అనేవాడు,



టామీని తమరు మరీ నెత్తిన ఎక్కించుకుంటున్నారని.

చంద్రమౌళిగారు టామీ వంక గర్వంగా చూసి నవ్వేసేవారు.

"ముచ్చుమనిషికన్నా బొచ్చుకుక్క నయం, వెంకటేశం. నాలుగు మెతుకులు విసిరేస్తేచాలు నమ్మకంగా పడిఉంటుంది దేవుణ్ణికూడా నమ్మటానికి వీల్లేదు. కానీ కుక్కపిల్లను నమ్మవచ్చునని నా ఉద్దేశ్యం. గాడ్‌ను తిరగేస్తే డాగ్ అవుతుంది. ఈ గాడ్, డాగ్ మనకు వీలైతే ఉపకారం చేయటానికి ప్రయత్నిస్తారు, మనిషిలాగా అపకారం చేయటానికి పూనుకోరు. ముఖ్యంగా తిన్న ఇంటికే వాసాలు లెక్కపెట్టటం..." ఆ మాటలు ఆయన ఎందుకు పూర్తిచేయలేకపోయినారో వెంకటేశానికి గుమ్మంలోకి చూసినప్పుడుగాని అర్థంకాలేదు.

ఎదురుగా సావిత్రి నిలబడి ఉంది. ఆమె ఎండకు ఎండి, వానకు తడిసి రంగు వెలిసిపోయిన బొమ్మలా ఉంది. కాలప్రభావానికి లోనై, కళాకాంతులను పోగొట్టుకున్న అందమైన శిలావిగ్రహం లాగా ఉంది. ఇంకా చెప్పాలంటే డబుల్ టైఫాయిడ్‌కు గురై, బ్రతికి బయటపడ్డ మనిషిలా ఉంది.

వెంకటేటం లేచి నిలబడ్డాడు. టామీ భౌమని అరుస్తూ ఆమెమీదకు దూకింది. వెంకటేశం 'ఫ్రండు, ఫ్రండు' అంటూ వెంటపడి టామీని వెనక్కు లాక్కు వచ్చాడు.

సుడిగాలికి కొట్టుకొచ్చిన చిత్తు కాగితంలాగా, సావిత్రి దూసుకొచ్చి చంద్రమౌళిగారి పాదాలదగ్గర వాలింది. ఆయన కాళ్ళు వెనక్కు లాక్కున్నారు.

"ఎందుకు వెళ్ళావు, ఎందుకు వచ్చావు?" ఎన్నాళ్ళనుంచో ఆయన హృదయంలో గుచ్చుకుంటున్న ప్రశ్నకు జవాబు దొరుకుతుందేమోనని ఆమె మొహంలోకి చూశారు.

ఆమె ఏడుస్తోంది తప్ప, నోరువిప్పి మాట్లాడటంలేదు.

"నీకు ఇప్పుడిక్కడ స్థానంలేదు. వెళ్ళిపో" అని గర్జించారాయన.

"ఇక్కడినుంచి వెళ్ళమనే ముందు నన్ను ఏ నూతిలో దూకి చచ్చిపోమంటారో చెప్పండి ..." అన్నది ఏడుస్తూనే.

"నాకు సంబంధించినంతవరకు నువ్వు చనిపోయి చాలాకాలం అయింది. ఇప్పుడింక నువ్వు ఏ నూతిలో పడినా ఒకటే. నా కళ్ళముందు మాత్రం కనపడకు, వెళ్ళు..." చంద్రమౌళిగారు చీదరించుకున్నా, ఆమె అభిమానపడలేదు. ఆయన కాళ్ళకు చుట్టుకుపోయి వలవలమని ఏడ్చింది. నిర్దయగానే వెనక్కినెట్టేసి పక్కకు తప్పుకున్నారు.

"మీరు కాదంటే, నాకు చావుతప్పదు. బెదిరించటానికి కాదు. నా పరిస్థితి అలా ఉంది. పూర్వంలో కాకపోయినా, మీ గడపలో ఆ కుక్కలా కనిపెట్టుకుని ఉంటాను. నాలుగుమెతుకులు విదల్చండి చాలు..." అని తన గోడు వెళ్ళబోసుకుంది సావిత్రి.

"నిన్ను కుక్కతో పోల్చుకుని టామీని అవమానపరచకు వెళ్లు ..."

"ఇప్పుడు నేను వెళ్ళినా తెల్లారేటప్పటికి నా శవాన్ని తీసుకొచ్చి మీ గుమ్మంలోనే పడుకోబెడతారు. ఇది ఖాయం..."

"నన్ను విసిగించకు వెళ్లు."

"సరే, నా మాటల్లోని నిజం ఇప్పుడు కాకపోతే, రేపయినా మీకు తెల్సివస్తుంది." అంటూ పౌరుషంగా తల ఎగరేస్తూ, కన్నీళ్ళు తుడుచుకుని, జుట్టు పైకి నెట్టుకుని వేగంగా వెళ్ళిపోయింది.

చంద్రమౌళిగారు వెన్నెముక విరిగిన మనిషిలా సోఫాలో కూలబడిపోయ్యారు. టామీ వచ్చి ఎదురుగ్గా కూర్చుంది. కళ్ళుమూసుకున్న చంద్రమౌళిగారికి పాడుబడిన బావిలోకి సావిత్రి భళ్ళున దూకిన దృశ్యమే కనిపించింది. గుండె గొంతుకలోకి వచ్చి అడ్డుపడింది. అయినా తమాయించుకుని వెంకటేశాన్ని పిల్చి సావిత్రిని తీసుకురమ్మన్నాడు. వాడు పరుగెత్తుకుంటూ వెళ్ళాడు.

పదినిముషాల తర్వాత సావిత్రి మళ్ళీ ఇంట్లోకి ప్రవేశించింది. ఈసారి చంద్రమౌళి ఎదుట నిలబడే ప్రయత్నం చేయలేదు. చొరవగా వంటింట్లోకి చొరబడింది.

రాత్రి తొమ్మిదిగంటలదాకా వెంకటేశం, టామీ ఇద్దరూ చంద్రమౌళి గారి పాదలదగ్గరే ఉన్నారు. ఆయన


మొహంలో విచారపు కారుమబ్బులు కమ్ముకునే ఉన్నాయి. గడియారం చూసుకుని ఆయనే వెంకటేశాన్ని వెళ్ళిపొమ్మని చెప్పారు.

తిరిగి తిరిగి చూసుకుంటూ వెళ్ళిపొయ్యాడు వెంకటేశం. అయితే అదే అయ్యగారి ఆఖరిచూపు అవుతుందని వెంకటేశం కలలోకూడా ఊహించలేదు.

తెల్లారి మామూలుగా ఎనిమిది గంటలకు వచ్చేటప్పటికి ఇరుగుపొరుగు వాళ్ళంతా ఇంటిముందు తీరిగ్గా కూర్చుని ఉన్నారు. అర్థంకాని వెంకటేశం లోపలికి తొంగిచూసి మెడదాకా తెల్ల గుడ్డ కప్పబడిఉన్న చంద్రమౌళిగారి శవాన్నిచూసి ఉలిక్కిపడ్డాడు. టామీ వెంకటేశాన్ని చూసి భౌమని అరుస్తూ ఎదురొచ్చింది. చంద్రమౌళిగారి పక్కన సావిత్రి జుట్టువిరబోసుకుని కూర్చుని, ఉండుండి పెద్దగా భర్తశవంమీదకు వంగి ఏడ్చి, శోష వచ్చినట్లు పక్కకు వాలిపోతోంది. వెంకటేశం ఎన్నడూ చూడని యువకుడొకడు సావిత్రిని లేపి, శుశ్రూష చేస్తున్నాడు. అతనే చంద్రమౌళిగారి అంత్యక్రియలకు ప్రయత్నాలు చేశాడు.

రాత్రి అన్నంతిని పడుకున్నాక, అయ్యగారి గుండె ఆగిపోయిందిట! ఎన్నెనో దెబ్బలను ఓర్చుకున్న చంద్రమౌళిగారి గుండె, ఆ రోజు రాత్రే ఎందుకు మూగపోయిందో అన్న సందేహం వచ్చింది వెంకటేశానికి.

కాసేపటికి చుట్టూ తిరిగి పెరట్లోకి వెళ్ళిన వెంకటేశానికి, సావిత్రి మాటలు




వినిపించినయి, శవాన్ని తొందరగా తీసుకుపొమ్మనమని. అంతా తయారై పోయిందని ఆ యువకుడు జవాబు చెప్పిన సరిగ్గా అయిదు నిముషాలకే, చంద్రమౌళిగారి శవాన్ని లేవదీయబోయినారు. సావిత్రి లేచి లోపలికి వెళ్ళింది. కానీ టామీ అడ్డంవచ్చింది. శవందగ్గరకు వచ్చినవాళ్ళందర్నీ తరిమేసింది. నిలువెత్తున ఎగిరి వాళ్ళమీదపడి రక్కింది. టామీ ఒక్కటే దీనంగా ఆయన పాదాలదగ్గర కూర్చుని, నాలిక బయటపెట్టి రొప్పుతున్నది దాని కళ్ళల్లో నుంచి కన్నీరుకూడా కారుతోంది. సావిత్రి కన్నీరులాగా, టామీ కన్నీరు ఆరటంలేదు. సావిత్రిలాగా, శవాన్ని తొందరగా తరలించాలని టామీ ఆరాటపడటంలేదు. ఎన్నిదినాలైనా అలా ఆయన పాదాలదగ్గరే పడి ఉండాలని దానికి ఉన్నట్లుంది.

జరగకూడనిదేదో జరిగిపోయింది. ఇక జరగవల్సిందేదో జరగాలికదా. వెంకటేశమే టామీని గొలుసుతో బంధించి, బలవంతంగా దూరంగా లాక్కెళ్ళాడు.

ఆ మర్నాటినుంచి వచ్చిన మార్పుకే వెంకటేశం ఆశ్చర్యపోయినాడు. దిక్కులేనిదని చెప్పిన సావిత్రికోసం ఎవరెవరో వచ్చి వెళ్తుండేవారు. వాళ్ళందర్నీ సావిత్రి సాదరంగా ఆహ్వానించి, ఆదరించి పంపుతుండేది. చంద్రమౌళిగారి గురించి ఆమె పూర్తిగా మర్చిపోయినట్లే ప్రవర్తించేది.

వెంకటేశం ఎంతప్రయత్నించినా టామీతిండితినటానికి ససేమిరా ఒప్పుకునేది కాదు. ఎవర్నీ దగ్గరికి రానిచ్చేది కాదు. చంద్రమౌళిగారిని ఎన్నాళ్ళయినా టామీ మర్చిపోలేక పోతున్నది.

పీనుగులాంటి సావిత్రి, రాను రాను ఏనుగులా అయిపోయింది.

ఏనుగులాంటి టామీ, రాను రాను పీనుగులా అయిపోయింది.

—పోయింది.

